క్లుప్తంగా

సామాజిక సేవలకు ప్రాధాన్యత



బాధ్యతలు స్వీకరించిన యునైటెడ్ ఇంటర్నేషనల్ కాపు క్లబ్ కార్యవర్గం

పాలకొల్లు అర్బన్: విద్య, వైద్య, సామాజిక సేవా కార్యక్రమాలకు యునైటెడ్ ఇంటర్నేషనల్ కాపు క్లబ్ ప్రాధాన్యతనిస్తుందని క్లబ్ గవర్నర్ డా.ముచ్చర్ల సంజయ్ అన్నారు. పట్టణంలోని అడబాల గార్డెన్స్‌లో సోమవారం క్లబ్ నూతన కార్యవర్గం పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అధ్యక్షుడిగా గాది ఆంజనేయులు, కార్యదర్శిగా పశ్యావుల రవికుమార్, కోశాధికారిగా ఇసుకొండ శేషాద్రి పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు పెనుమాక రామమోహన్‌రావు, జక్కంపూడి మదన్ మోహన్, కానూరి ప్రభాకర్, రావూరి అప్పారావు, మద్దాల వాసు, సభ్యులు పాల్గొన్నారు.

డెంగీ వ్యాధిపై అవగాహన ర్యాలీ



లంకలకోడేరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ర్యాలీ

పాలకొల్లు అర్బన్: డెంగీ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ డా. అద్దాల ప్రతాప్‌కుమార్ అన్నారు. మండలంలోని లంకలకోడేరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు మెడికల్ ఆఫీసర్ డా. ప్రతాప్‌కుమార్ అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో దోమలు పెరగకుండా శుభ్రత పాటించాలన్నారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి కె రాజ్‌కుమార్, ఆరోగ్య విస్తరణాధికారులు గుడాల హరిబాబు, కె ప్రభాకర్, పీహెచ్‌ఎన్ పి ఎలిజబెత్, పాఠశాల హెచ్‌ఎం జీవీజె ప్రసాదరావు, పి భాగ్యలక్ష్మి, సూపర్‌వైజర్లు బాలచంద్రుడు, కమల, ఎంఎల్‌హెచ్‌పీ మార్తమ్మ, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆగర్రులో పౌర హక్కుల దినోత్సవం



ఆగర్రులో పౌర హక్కులపై మాట్లాడుతున్న ఆర్ఐ కె వరలక్ష్మి

పాలకొల్లు అర్బన్: పౌరులు తమ హక్కులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఐ కె వరలక్ష్మి కోరారు. మండలంలోని ఆగర్రులో సోమవారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆర్ఐ మాట్లాడుతూ గ్రామంలో అందరూ కలిసి జీవించాలన్నారు. కుల వివక్ష, వెలివేయడం వంటి చర్యల వల్ల చట్టప్రకారం శిక్షార్హులవుతారన్నారు. సర్పంచ్ సాకా గంగారత్నం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కండిబోయిన శివన్నారాయణ, సాకా కమలాకర్, కొల్లాబత్తుల భాస్కరరావు, వీఆర్వో ఎస్ వీరాస్వామి, పంచాయతీ కార్యదర్శి ఆనందబాబు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



మార్టేరులో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న ఎంపీటీసీ కర్రి అనురాధ

పెనుమంట్ర: మార్టేరు బాసంతిదేవి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీటీసీ కర్రి అనురాధ పరిశీలించారు. విద్యార్థులతో కలిసి ఆమె రాగిజావ, భోజనాన్ని రుచి చూసి వంటవారికి సూచనలిచ్చారు.

రైతు ప్రయోజనాలే లక్ష్యం

పాలకోడేరు: రైతుల ప్రయోజనాలను కాపాడేందుకే ముఖ్యమంత్రి జగనన్న జగనన్న భూహక్కు, భూ రక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు ఎంపీపీ చైర్మన్ భూపతిరాజు చంటిరాజు అన్నారు. సోమవారం పాలకోడేరు, వేండ్ర గ్రామాల్లో నిర్వహించిన సభల్లో ఆయన మాట్లాడారు. తహసీల్దార్ షేక్ హుస్సేన్ మాట్లాడుతూ రెండు గ్రామాల్లో డ్రోన్ల ద్వారా భూముల సర్వే పూర్తయిందని, తొలుత రైతులకు 9(2) నోటీసులిచ్చి 15 రోజుల పాటు అభ్యంతరాలు స్వీకరించామని తెలిపారు. తర్వాత జేసీ నోటిఫికేషన్ జారీ చేస్తారన్నారు. వేండ్రలో 869.77, పాలకోడేరులో 1178.95 ఎకరాలుగా గుర్తించామన్నారు గొల్లలకోడేరు గ్రామంలో భూసర్వే ప్రారంభించనున్నట్టు చెప్పారు. రీ సర్వే సర్వేయర్ సూర్యనారాయణ రాజు, సర్పంచ్ కడలి నాగేశ్వరి, ఎంపీటీసీ పాల జ్యోతి చిన్నా, కుక్కల సాయి కృష్ణ, వీఆర్వో అలేఖ్య, సర్వేయర్ ఆంజనేయులు ఇంజినీరింగ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.



యలమంచిలి: దొడ్డిపట్లలో వరద ముంపునకు గురైన ఇసుక ర్యాంపు



యలమంచిలి: పెదలంకలో ముంపునకు గురైన ప్రధాన రహదారి



నరసాపురం రూరల్: పాలకొల్లు రోడ్డులో ఇసుక ర్యాంపు వద్ద లంగరేసిన బోట్లు

వరద బాధితులకు అండగా ప్రభుత్వం

- ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్
- సహాయక చర్యలపై సమీక్ష
- వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలన



యలమంచిలి: కనకాయలంకలో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ పర్యటన



నరసాపురం రూరల్: వరద నీటిలో సియోను ప్రార్థనా మందిరం



నరసాపురం రూరల్: పాత నవరసపురం ఎస్టీ కాలనీలో వరద నీరు

యలమంచిలి: వరద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ చెప్పారు. వరద ముంపునకు గురైన దొడ్డిపట్ల, లక్ష్మీపాలెం, ఏనుగువానిలంక, బాడవ, కనకాయలంక, పెదలంకలో సోమవారం ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లోని వరద బాధితులకు ప్రభుత్వం నుంచి వచ్చిన నిత్యావసర సరుకులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదను సమర్థంగా ఎదుర్కొనేందుకు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. వరద బాధితులను ఆదుకునేందుకు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, వికలాంగుల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. వైద్యం అవసరమైన వారిని వైద్య కేంద్రాలకు తరలించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వరద తగ్గుముఖం పట్టిన తరువాత ముంపునకు గురయిన పంటలకు నష్టం అంచనా వేసి పరిహారం అందిస్తామని శ్రీనివాస్ చెప్పారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ యడ్ల తాతాజీ, పార్టీ మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు తహసీల్దార్ మాతా సునీల్‌కుమార్, పార్టీ నాయకులు, సర్పంచ్‌లు చిలువూరి కుమార దత్తాత్రేయవర్మ, ఓదూరి భాస్కరరావు, ఉచ్చుల స్టాలిన్, ఇలపకుర్తి నరసింహారావు, వల్లభు సాయి వెంకట నరసింహారావు, గటిగంటి మహేష్, మద్దా శ్రీనివాసరావు, కొప్పాడి శ్రీనుబాబు తదితరులు ఉన్నారు.

వరద ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరం



పాలకొల్లు మండలస్థాయి స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ ఎస్ రామ్‌సుందర్‌రెడ్డి

పాలకొల్లు అర్బన్: వరద ప్రాంతాలకు నిత్యావసరాలు సకాలంలో అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ రామ్‌సుందర్‌రెడ్డి ఆదేశాలిచ్చారు. పాలకొల్లు మండల స్థాయి నిత్యావసరాల స్టాక్ పాయింట్‌ను సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రిజిస్టర్లు పరిశీలించారు. గర్భిణులకు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహార కిట్లు తయారీ విధానాన్ని జేసీ పరిశీలించారు. రేషన్ బియ్యం స్టాక్ నిల్వలపై ఆరా తీశారు. నాణ్యతా ప్రమాణాలతో పనులు చురుగ్గా నిర్వహించాలన్నారు. తూనికలు, కొలతలు తేడా లేకుండా చూడాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. తహసీల్దార్ సీహెచ్ పెద్దిరాజు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వాతావరణ మార్పుతో రైతుల ఆందోళన

మొగల్తూరు: వాతావరణ మార్పులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు కురిసిన వర్షాలకు ఆకుమడులు మునిగిపోవడంతో రైతులకు ఏం చేయాలో పాలుపోలేదు. రెండు రోజులు పాటు వరుణుడు కరుణించడంతో నారుమడుల్లో నిలిచిన నీటిని బయటకు తోడారు. సోమవారం ఉదయం నుంచి ఆకాశం మబ్బుగా ఉండటంతో పాటు చిరుజల్లులు కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 1,198 ఎకరాల్లో సార్వా సాగు చేపట్టగా ఇప్పటి వరకు కేవలం 65 ఎకరాల్లో ఆకుమడులు వేయగా, 180 ఎకరాల్లో నాట్లు వేసారు.

సమాజ సేవలు అభినందనీయం



బ్రాహ్మణచెరువులో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ కర్రి గౌరీ సుభాషిణి

పెనుమంట్ర: దాట్ల వారసత్వాన్ని కుటుంబ సభ్యులు కొనసాగిస్తూ ఏటా సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి అన్నారు. ఎస్ఆర్ దాట్ల 44వ వర్ధంతి సందర్భంగా సోమవారం బ్రాహ్మణ చెర్వు చింతపల్లి శ్రీరాములు స్మారక బస్‌స్టేషన్ వద్ద దాట్ల వర్ధంతి ఏర్పాటు కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన బయలాజికల్ లిమిటెడ్ వారి సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఎస్ఆర్ దాట్ల, భార్య సూర్యావతి, విజయ్‌కుమార్ దాట్ల, చింతపల్లి శ్రీరాములు చిత్రపటాలకు సీఎంపీ సీపీఎం రాష్ట్రకార్యదర్శి వి శ్రీనివాస్‌రావు పూల మాలలు వేసినివాళులర్పించారు. చింతపల్లి శ్రీరాములు స్మారక బస్సు స్టాండ్ నుంచి పెనుమంట్ర ఎస్ఆర్ దాట్ల స్తూపం వరకు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి బి బలరాం, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జుత్తిగ నరశింహమూర్తి, సీపీఎం జిల్లా వర్గ సభ్యులు కేతా గోపాలన్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్, పెనుమంట్ర సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక, మార్టేరు ఉపసర్పంచ్ కర్రి వేణుబాబు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కేతా పద్మజ, ఎస్ఆర్ దాట్ల సభ్యులు రాఘవరాజు పాల్గొన్నారు.

వర్షపు నీటి మళ్లింపు చర్యలు



నీటి మళ్లింపు పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ సాంబశివరావు

ఉండి: మండలంలోని చెరుకువాడ గ్రామ లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టినట్టు సర్పంచ్ కొండవేటి సాంబశివరావు తెలిపారు. సోమవారం గ్రామంలోని చినపేట, కాపులపేట, ఎస్సీ ఏరియాల్లో చేపట్టిన వర్షపునీటి మళ్లింపు పనులను ఆయన పర్యవేక్షించారు. కచ్చా డ్రెయిన్లలో మట్టి పూడుకుపోయి కొంతమేర ఇబ్బందులు ఎదురవుతున్నాయని సర్పంచ్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోన్న నిధులతో సీసీ డ్రెయిన్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. ముందుగా నిల్వ నీటిని తొలగిస్తే దోమల బెడద ఉండదని, జ్వరాలు, రోగాలు రాకుండా ఉంటాయనే ఉద్దేశంతో పారిశుధ్య పనులు చేపట్టామని తెలిపారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు పర్యవేక్షణలో గ్రామంలో అనేక లోతట్టు ప్రాంతాల్లో సీసీరోడ్లు నిర్మించామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు కొండవేటి సత్యనారాయణ, ఎంపీటీసీ చిరుగుపాటి కృష్టాఫర్, బొడ్డు నాగన్న, వార్డు సభ్యులు, కార్యదర్శి కె.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ కార్యవర్గాల ప్రమాణస్వీకారం

సాక్షి, భీమవరం: సామాజిక సేవ చేసేవారిని మరింతగా ప్రోత్సహించడం అభినందనీయమని ఆర్డీఓ దాసి రాజు అన్నారు. భీమవరం పట్టణం, పాలకోడేరు లయన్స్ క్లబ్స్ ప్రమాణ స్వీకారం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. లయన్స్ క్లబ్ భీమవరం పట్టణ అధ్యక్ష కార్యదర్శులుగా నడింపల్లి మహేష్‌వర్మ, బొండా రామకృష్ణ (రాంబాబు), కోశాధికారిగా కోట్ల నాని, క్లబ్ పాలకోడేరు మండల అధ్యక్ష, కార్యదర్శులుగా ముదునూరి వెంకటరాజు, సన్నిధి పాశేశ్వరరావు, కోశాధికారిగా జి.పురుషోత్తంలతో ఇన్స్టాలేషన్ ఆఫీసర్ చిలుకూరి కృష్ణంరాజు, పాస్ట్ డిస్టిక్ గవర్నర్ డాక్టర్ త్సవటపల్లి సత్యనారాయణమూర్తి (బాబ్జి) ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాబ్జి, సెకండ్ వైస్ డిస్టిక్ గవర్నర్ ఎస్‌వీవీఎస్ పాపారావునాయుడు, రీజియన్ చైర్మన్ దాట్ల రామరాజు, జోన్ చైర్మన్ నందమూరి రాజేష్, డాక్టర్ జి.గోపాలరాజు, భీమాల శ్రీరామమూర్తి తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో వబిలిశెట్టి కనక రాజు, విమల్ సకరియా, పాల్గొన్నారు.

వాలీబాల్ తగాదాపై కేసులు

ఉండి: వాలీబాల్ ఆట సమయంలో ఏర్పడ్డ తగాదా నేపథ్యంలో ఇరువర్గాలపైనా కేసులు నమోదు చేశామని ఎస్సై కె.గంగాధరరావు తెలిపారు. ఉండి నిమ్మలపేటలో వాలీబాల్ ఆడుతున్న సమయంలో జరిగిన గొడవ నేపథ్యంలో వాలీబాల్ చూసేందుకు వచ్చిన అంబళ్ల నాని అనే వ్యక్తి, మరికొందరు క్రికెట్ బ్యాట్‌తో తనను కొట్టి గాయపర్చారని బాలాజీరావు పేటకు చెందిన కొమ్మన పవన్‌సాయి అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడన్నారు. కొమ్మన పవన్ సాయి అనే వ్యక్తి, మరి కొందరు పాతగొడవల నేపథ్యంలో తనను కర్రతో కొట్టి గాయపర్చారని కొండ్రోతుపేటకు చెందిన అంబళ్ల హేమ్‌కుమార్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడని చెప్పారు. ఇరువురూ భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసులు దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు.

ఆక్రమణల తొలగింపుపై రాద్ధాంతం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నరసాపురం రూరల్: నరసాపురం స్టీమర్ రోడ్డులో డ్రెయిన్ నిర్మాణానికి ఆక్రమణలు తొలగిస్తున్న సందర్భంగా అందరి ఆక్రమణలతో పాటు మాజీ ఎమ్మెల్యే మాధవనాయుడు ఆక్రమణలను కూడా తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడితే దానిని ఆయన ప్రజా సమస్యగా చిత్రీకరించి రాద్ధాంతం చేయడం సిగ్గు చేటని వైసీపీ పట్టణ అధ్యక్షుడు భూసారపు జయ విమర్శించారు. ఆక్రమణల తొలగింపు, మాధవనాయుడు అరెస్టు, సోమవారం బంద్‌కు పిలుపును ఇచ్చిన నేపథ్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. రాబోయే కాలంలో కాబోయే ఎమ్మెల్యేని నేనే అంటూ వ్యాపారులను భయపెట్టి బంద్‌కు పిలుపునివ్వడం మాధవనాయుడు చౌకబారు రాజకీయాలను బహిర్గతం చేస్తోందన్నారు. మార్కెట్‌లో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి తన ఉనికిని చాటుకునేందుకు అష్టకష్టాలు పడ్డారన్నారు. ప్రసాదరాజు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఇలాంటి అరాచకాలు సృష్టిస్తున్నారన్నారు. న్యాయమూర్తిని దుర్భాషలాడే నైజం ప్రసాదరాజుది కాదన్నారు. సరిపల్లిలో దళితుడిపై చేయిచేసుకున్న నీ నైజాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, మాజీ జెడ్పీటీసీ చాగంటి సత్యనారాయణ, కామన బాల సత్యనారాయణ (బుజ్జి), బుల్లిమస్తాన్, ఇంజేటి జాన్ కెనడీ మాట్లాడుతూ నీతి, నిజాయతీతో ఎంతో పారదర్శకంగా వ్యవహరించే ప్రసాదరాజును విమర్శించే స్థాయి బండారుకు లేదన్నారు. దర్భరేవు భూముల్లో అవినీతి మాజీ ఎమ్మెల్యేని వెంటాడుతోందన్నారు. నరసాపురం, భీమవరం రహదారిలో సరిపల్లి వద్ద ఉన్న వ్యాపారులను మాధవనాయుడు తరిమేసి కేవలం తన స్థలం పక్కన మాత్రమే రెండు లైన్ల ఆర్అండ్‌బీ రహదారి నిర్మించుకున్న స్వార్థపరుడని విమర్శించారు. బందారు మాధవనాయుడుది ముమ్మాటికీ వ్యక్తిగత సమస్యేనని, స్వప్రయోజనాల కోసం అభివృద్ధిని అడ్డుకుంటూ వ్యాపారులకు ముడిపెట్టడం సరికాదన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, కౌన్సిలర్ బర్రి జయరాజు పాల్గొన్నారు.

హాస్యపు జల్లు అల్లుకు ఘన నివాళి



అల్లు రామలింగయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అభిమానులు

పాలకొల్లు అర్బన్: హాస్యపు జల్లు అల్లు రామలింగయ్య 19వ వర్ధంతిని సోమవారం అభిమానుల సమక్షంలో నిర్వహించారు. అల్లు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాలకొల్లుకి చెందిన అనేక మంది కళాకారులు సినీ పరిశ్రమలో స్థిరపడడానికి అల్లు రామలింగయ్య స్ఫూర్తిగా నిలిచారన్నారు. అల్లు రామలింగయ్య అభిమానులు తులా రామలింగేశ్వర రావు, శిడగం సురేంద్ర సంతోష్‌కుమార్, తులా సురేష్, కొమ్ముల దినేష్, చేబ్రోలు కృష్ణమోహన్, విన్నకోట గోపి, మద్దాల గణేష్, ముచ్చర్ల రామదాసు, మూర్తి, సంగుల రాజు తదితరులు పాల్గొని అల్లు రామలింగయ్య విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

స్పందన ద్వారా సమస్యల పరిష్కారం



సబ్‌కలెక్టర్ ఎం సూర్యతేజ వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: స్పందన కార్యక్రమం ద్వారా పలు సమస్యల పరిష్కారమవుతున్నాయని సబ్ కలెక్టర్ సూర్యతేజ అన్నారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయ వీడియోకాన్ఫరెన్స్ హాల్లో సోమవారం నిర్వహించిన స్పందనలో డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల ప్రజల నుంచి 54 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ ఎం సూర్యతేజ ఆర్జీలను చదివి పరిశీలించి ఫిర్యాదుదారులకు భరోసా ఇచ్చారు. ఈ రోజు అందిన కొన్ని ఫిర్యాదుల్లో కొప్పర్రుకు చెందిన పోలిశెట్టి మణికుమారి, పేరుపాలెంకు చెందిన బొక్కా పెద్దిరాజు ఇంటి స్థలం కోసం, పాలకొల్లుకు చెందిన వెన్నపు సరోజిని వృద్ధాప్య పెన్షన్ కోసం, మల్లు ప్రశాంతి రేషన్‌కార్డులో పేరు నమోదు కోసం అర్జీ అందజేశారు. మరో నలుగురు భూసర్వే సమస్య పరిష్కారం కోరగా కొందరు రైతులు నత్తలావా, రుస్తుం బాద డ్రెయిన్లు ముంపు నీటిని లాగక పోవడంతో చేలల్లోనీరు నిలిచి సాగుకు ఆటంకంగా ఉంటుందని స్లూయిజ్ గేట్లకు మరమ్మతులు చేపట్టాలని పలువురు రైతులు సబ్‌కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

న్యాయవాది హత్యకు నిరసనగా విధుల బహిష్కరణ



న్యాయవాది హత్యకు నిరసనగా విధుల బహిష్కరించిన నరసాపురం బార్ అసోసియేషన్ సభ్యులు

నరసాపురం రూరల్: విజయవాడ బార్ అసోసియేషన్ సభ్యుడు రాయసం ఆదిశేషు విటల్‌బాబు హత్యకు నిరసనగా సోమవారం నరసాపురం బార్ అసోసియేసన్‌కు చెందిన న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా దానయ్యనాయుడు మాట్లాడుతూ విటల్‌బాబు హత్యను పాశవిక చర్యగా అభివర్ణించారు. న్యాయం కోసం నిరంతరం పోరాడే న్యాయవాదులకు రక్షణ కరువైందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకువచ్చేందుకు కృషి చేయాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో న్యాయవాదులు ఆర్‌జి కుమార్, బళ్ల శ్రీహరి, దొంగ నరసింహరాజు, పోలిశెట్టి బాబ్జి, సూర్యచంద్రరావు, పుప్పాల కృష్ణారావు, గునిశెట్టి శ్రీనివాస్, గన్నాబత్తుల శివాజీ చక్రవర్తి, కెనడీ, క్రాంతి, కొత్తపల్లి రమేష్, బొలిశెట్టి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ దాట్లకు ఘన నివాళి

పెనుమంట్ర: అత్తిలి నియోజకవర్గంలోనే కాదు, రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో ఆదరాభిమానాలు కలిగిన నాయకుడు ఎస్ఆర్ దాట్ల అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కొనియాడారు. సోమవారం ఎస్ఆర్ దాట్ల 44వ వర్ధంతి సందర్భంగా పెనుమంట్ర దాట్ల స్తూపం వద్ద ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కల్లుగీత కార్మికులందరినీ ఏకంచేసి సంఘాన్ని నిర్మించిన వ్యవస్థాపకుడు ఎస్ఆర్ దాట్ల అని అన్నారు. సీపీఎం మండల అధ్యక్షుడు కూసంపూడి సుబ్బరాజు, సీఐటీయూ మండల కార్యదర్శి కోడే శ్రీనివాస్ ప్రసాద్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు బత్తుల విజయకమార్, చింతపల్లి లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ వైఖరిపై సీపీఎం నిరసన

పెనుమంట్ర: రాష్ట్ర విభజన తరువాత రాష్ట్రానికి ఎంత అన్యాయం జరిగిందో రాష్ట్ర ప్రజలందరూ గమనించారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఎస్ఆర్ దాట్ల 44వ వర్ధంతి కార్యక్రమం అనంతరం సీపీఎం నాయకులు ఆందోళన నిర్వహించారు. కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కుదరదంటూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజానీకానికి ద్రోహం చేసిందని బ్రాహ్మణచెర్వు సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ రైల్వేజోన్‌గా ప్రకటిస్తామని, ఉత్తరాంధ్రకి సుజల స్రవంతి నీళ్లు తీసుకువస్తామని చెప్పిన ప్రధాని మోదీ మాట మార్చారని విమర్శించారు. మరొకవైపు విశాఖ ఉక్కు పరిశ్రమను విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు మంతెన సీతారాం, జిల్లాకార్యదర్శి బి బలరాం పాల్గొన్నారు.